# కాంగ్రెస్‌కు ఓటేస్తే రౌడీ రాజ్యమే..

- ఆ పార్టీలో అసమ్మతి సునామీ మొదలైంది
- జండుబామ్ పెట్టుకొని ఏడ్చే వారి మాటలు నమ్మొద్దు
- జిల్లాకు 500 పడకల దవాఖాన, మైనింగ్ ఇంజినీరింగ్ కళాశాలను తీసుకొస్తా
- భూపాలపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర
- గోరికొత్తపల్లి మండలంలో ఆత్మీయ సమ్మేళనాలు, భూపాలపల్లి మున్సిపాలిటీలో ప్రచారం



వేశాలపల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ/ రేగొండ, (గోరికొత్తపల్లి) అక్టోబర్ 31 : కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపిస్తే రౌడీలు రాజ్యమేలుతారని భూపాలపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, 11వ వార్డు కౌన్సిలర్ బానోత్ రజితా జుమ్మిలాల్ ఆధ్వర్యంలో మంగళవారం వేశాలపల్లి, భాస్కర్‌గడ్డలో ఎమ్మెల్సీ సారయ్యతో కలిసి గండ్ర ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. అలాగే గోరికొత్తపల్లి మండలకేంద్రంతో పాటు నిజాంపల్లె, రాజక్కపల్లె, దామరంచపల్లె, చిన్నకోడెపాక, చెన్నాపురం గ్రామాల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ తనను వేశాలపల్లి ప్రజలు కుటుంబ సభ్యుడిగా ఆహ్వానించి, భారీ మెజార్టీతో గెలిపిస్తామనడం చాలా సంతోషంగా ఉందన్నారు. భూపాలపల్లి నగరపంచాయతీ కావడానికి జనాభా సరిపోకపోతే 2012లో వేశాలపల్లిని నగరపంచాయతీలో విలీనం చేస్తే కొంతమంది వ్యతిరేకించారన్నారు. పట్టణాలకు దీటుగా విలీన గ్రామాలను అభివృద్ధి చేస్తానని చెప్పి 2018లో గెలిచిన వెంటనే వేశాలపల్లి, జంగేడు, కాశీంపల్లి, పుల్లురి రామయ్యపల్లి, మహబూబ్ పల్లి గ్రామాలను సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతో నాలుగు లేన్ల రోడ్లు వేసి అభివృద్ధి చేశానన్నారు. భూపాలపల్లి పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతమని, బీఆర్ఎస్ పాలనలో భూముల రేట్లు పెరిగి ఒక్క ఎకరం రూ.2కోట్లు ఉందన్నారు. ఇటీవలే మంత్రి కేటీఆర్ సహకారంతో ఔటర్ రింగ్‌రోడ్డు తీసుకువచ్చామని, ఓఆర్ఆర్ ఏర్పాటుతో వీలీన గ్రామాల భూములకు రేట్లు ఆకాశానికి పెరుగుతాయన్నారు. వేశాలపల్లిలో అత్యధికంగా ఎస్టీలు ఉన్న ప్రాంతమని, 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ వారిని పట్టించుకోలేదన్నారు. కేంద్రం సహకరించకపోయినా 6శాతం ఉన్న రిజర్వేషన్లను సీఎం కేసీఆర్ 10శాతానికి పెంచాడన్నారు. ఐదేండ్లలో తాను చేసిన అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. జిల్లాలకు మైనింగ్ ఇంజినీరింగ్ కళాశాల, 500 పడకల ఆసుపత్రిని తీసుకువస్తాని హామీ ఇచ్చారు. కొంతమంది కాంగ్రెస్ నాయకులు ఒక్కసారి అవకాశమివ్వండని జండూబామ్ పెట్టుకొని దొంగ ఏడుపు ఏడుస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఇంకా 100 డబుల్ బెడ్‌రూమ్‌లున్నాయని, వాటిని అర్హులకు అందజేస్తామన్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం 15 జీపీలతో కలిపి గోరికొత్తపల్లిని నూతన మండలంగా ఏర్పాటు చేశామన్నారు. ఎండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న గోరిసాబ్ భూములకు పట్టాలు ఇప్పిచడంతో పాటు గోరికొత్తపల్లిలో సీసీ రోడ్లు, దళిత, బీసీలకు రూ.లక్ష, కల్యాణలక్ష్మి వంటి పథకాలు ఇచ్చినట్లు చెప్పారు. ఎమ్మెల్సీ సారయ్య మాట్లాడుతూ గండ్ర వెంకటరమణారెడ్డి భూపాలపల్లిని వరంగల్‌కు దీటుగా అభివృద్ధి చేశాడన్నారు. డ్రైనేజీలు, సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్లు నిర్మించాడన్నారు. ఎవరూ ఊహించని మెడికల్ కళాశాలను తీసుకొచ్చి భూపాలపల్లిలో వైద్య విద్య అందిస్తున్నారని తెలిపారు. భూపాలపల్లి మరింత వేగవంతంగా అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకు ఓటు వేసి గండ్రను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

వేశాలపల్లికి చెందిన కాంగ్రెస్ ఎస్టీసెల్ అర్బన్ ఉపాధ్యక్షుడు నంగావత్ రాజేందర్‌తో పాటు 50మంది నాయకులు కౌన్సిలర్ రజితా జుమ్మిలాల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన 50మంది కాంగ్రెస్ నాయకులు, వైఎస్సార్‌టీపీ గణపురం మండల అధ్యక్షుడు సొక్కం సదయ్య, ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ బీసీ సెల్ భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడు చుక్క బాలరాజు సొంత గూటికి చేరుకున్నారు. టేకుమట్ల మండలం సుబ్బక్కపల్లి, పెద్దంపల్లి గ్రామాల నుంచి కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. సుబ్బక్కపల్లికి చెందిన మాజీ సర్పంచ్ ఊరుగొండ సమ్మయ్య ఇటీవల కాంగ్రెస్‌లో చేరగా తిరిగిబీఆర్ఎస్‌లో చేరారు. అలాగే కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మామిడి తిరుపతి, కాటం తిరుపతిరెడ్డి ఆ గ్రామ నాయకులు 100 మందితో కలిసి, బీజేపి యూత్ నాయకులు రఘు, శివ తమ నాయకులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. పెద్దంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు బోయిని అనిల్, రాజు, రవి, శాస్త్రాల సమ్మయ్య, బోయిని రమేశ్, చిట్యాల పోశాలు, బోయిని సారంగం, రమేశ్, అనిల్ గులాబీ పార్టీకి జైకొట్టారు. వారందరికీ పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, రాష్ట్ర యువ నాయకుడు గండ్ర గౌత్‌రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ కుమార్, 13వ వార్డు కౌన్సిలర్ మంగళపెల్లి తిరుపతి, ఎస్సీ సెల్ అర్బన్ అధ్యక్షుడు మోకిడి అశోక్, నాయకులు దుండ్ర కుమార్, జాగరి అజయ్, పోలవేణి ప్రసాద్, మోతె రాజు, టేకుమట్ల ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జడ్పీటీసీ పులి తిరుపతి రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్ష కార్యదర్శులు సట్ల రవి, తిరుపతి, ఆది రఘు, గోరికొత్తపల్లి మండల అధ్యక్షుడు మటిక సంతోష్, జడ్పీటీసీ సాయిని విజయ, పీఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్‌రావు, రేగొండ, గోరికోత్తపల్లి మండల ఎన్నికల ఇన్‌చార్జిలు సుజిత్‌రెడ్డి, అభిలాష్‌రెడ్డి, నాయకులు ఎంఏ హమీద్, పున్నం రవి, విద్యాసాగర్‌రెడ్డి, మైస భిక్షపతి, గంజి రజినీకాంత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోచంపల్లి, పక్కన పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు

# సంచులక్కగా సీతక్క

**కర్ణాటక డబ్బు లతో ఇక్కడి ప్రజా ప్రతినిధుల కొనుగోలు**

- సీతక్కది అవినీతి రాజకీయం.. కర్ణాటక నుంచి రూ.90కోట్లు
- నిజంలేకుంటే మేడారం తల్లుల వద్ద సీతక్క ప్రమాణం చేయాలి
- నాయకుడి స్థాయిని బట్టి రేటు.. కాంగ్రెస్‌కు ఓటేస్తే గూండాయిజమే
- బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే ప్రజాహితం
- ములుగు నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

ములుగు, అక్టోబర్31(నమస్తే తెలంగాణ): ములుగు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, మంచిని చూసి ఓట్లు వేయాలని బీఆర్ఎస్ అడుగుతుంటే కాంగ్రెస్ అభ్యర్థి సీతక్క కర్ణాటక నుంచి వచ్చిన రూ.90కోట్ల డబ్బుతో ప్రజాప్రతినిధులను అంగట్లో సరుకులను కొన్నట్లు కొంటున్నారని ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నర్సింహారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ శాంతి భద్రతల పరిరక్షణకు ఎంతో కృషి చేస్తే ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు హత్యా రాజకీయాలకు తెరలేపారని అన్నారు. ఇందులో భాగంగానే మెదక్ ఎంపీ, దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్యకర్త హత్యా ప్రయత్నం చేశాడని తెలిపారు. దీనిని ములుగు జిల్లా తరుపున తీవ్రంగా ఖండిస్తూ విచారం వ్యక్తం చేస్తున్నామన్నారు. మత కల్లోలాల సంస్కృతి కలిగిన కాంగ్రెస్ పరిపాలన కావాలో ప్రజలకు మంచి చేస్తున్న బీఆర్ఎస్ కావాలో ఓటర్లు తేల్చుకోవాలన్నారు.

### డబ్బు సంచులతో గ్రామాల్లోకి..

ఎన్నికల్లో గెలుపొందేందుకు ఎమ్మెల్యే సీతక్క డబ్బు సంచులతో బయలుదేరిందని, కరోనా సమయంలో కూరగాయల సంచులతో తిరిగిన సీతక్క ఎన్నికల సమయంలో డబ్బు సంచులతో గ్రామాల్లో తిరుగుతూ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల సీతక్కకు కర్ణాటక రాష్ట్రం నుంచి రూ.90కోట్లు రాగా గుడెప్పాడ్‌లోని ఎన్ఎస్ఆర్ హోటల్‌లో ఆమె వాటిని తీసుకొని పరకాల నియోజకవర్గానికి రూ.20కోట్లు, భూపాలపల్లి నియోజకవర్గానికి రూ.20కోట్లు పంపి మిగిలిన రూ.50కోట్లు ములుగు నియోజకవర్గంలో ఎన్నికల ఖర్చుల కోసం తెచ్చుకుందన్నారు. ఇది అబద్దం అని అంటే మేడారం సమ్మక్క-సారలమ్మ వద్ద సీతక్క ప్రమాణం చేయాలని అన్నారు. ఆ డబ్బులతో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను స్థాయిని బట్టి రేట్లు నిర్ణయించి సంతలో పశువుల్లా కొనుగోలు చేస్తున్నారన్నారు. ములుగులో ఓటమి భయం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల కొనుగోలుకు నిదర్శనమన్నారు. ఐదేళ్లుగా ప్రజా సేవ చేసినట్లయితే ప్రస్తుతం ప్రజాప్రతినిధుల కొనుగోలు అవసరం ఏమిటని నిలదీశారు. ప్రజా సేవ పేరుతో ఎమ్మెల్యే సీతక్క రీలక్కగా మారి ప్రస్తుతం ఎన్నికల్లో డబ్బు సంచులతో బయలుదేరి సంచులక్కగా మారిందన్నారు. సొంత పార్టీ నాయకులతో పాటు ఇతర పార్టీల నుంచి వచ్చి చేరిన నాయకులను మోసం చేసే విధానాలను సీతక్క అవలంభిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మంత్రిని అవుతానని, ఒక వేళ అధికారంలోకి రాకున్నా బీఆర్ఎస్‌లో చేరి మంత్రిని అవుతానని మోసపూరిత ప్రకటనలు నాయకుల వద్ద చేస్తున్నట్లు చెప్పారు. పాజిటివ్ రాజకీయాలను ప్రోత్సహించే బీఆర్ఎస్ చేసిన మంచి పనులు చెప్పి ఓట్లు అడుగుతుందన్నారు. సీతక్క చేస్తున్న బేర సారాలను గమనించి ప్రజలు ఆమె విధానాలను ఓటు ద్వారా ఖండించాలని కోరారు. రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తవద్దంటే బీఆర్ఎస్‌ను ఆదరించాలన్నారు. సమావేశంలో తాడ్వాయి ఎంపీపీ వాణిశ్రీ, ఓడీసీఎంఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గండ్రకోట సుధీర్‌యాదవ్, వేల్పూరి సత్యనారాయణరావు, పోడెం కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మాటలు నమ్మొద్దు

**బీఆర్ఎస్ భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు**

భద్రాచలం, అక్టోబర్31 : కాంగ్రెస్ నాయకులు మీ వద్దకు వచ్చి ప్రలోభాలకు గురి చేస్తారని, వారి మాటలు నమ్మవద్దని భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు అన్నారు. మంగళవారం ఆయన చర్ల రోడ్డులోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ యూనియన్ సమావేశానికి హాజరై మాట్లాడారు. అన్ని వర్గాల వారిని దృష్టిలో ఉంచుకొని సీఎం కేసీఆర్ ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. నన్ను గెలిపించండి... మీకు అండగా నేనుంటానని తెలిపారు. ప్రభుత్వం రావాల్సిన పథకాలు, సంఘానికి అవసరమైన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పదేళ్లుగా భద్రాచలం నియోజకవర్గం వెనకబడే ఉందని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు పట్టంకట్టి అభివృద్ధికి బాటలు వేయాలన్నారు.

## మీ బిడ్డగా వస్తున్నా..

# గెలిపించి అసెంబ్లీకి పంపండి

- కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దు
- ఆలోచించి ఓటు వేయండి.. అభివృద్ధికి పట్టం కట్టడి
- లక్నవరం సరస్సుకు దేవాదుల నీటిని మళ్లిస్తాం
- గోవిందరావుపేట ప్రచార ర్యాలీలో ములుగు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి

గోవిందరావుపేట, అక్టోబర్31 :'చిన్నతనంలోనే అమ్మానాన్నలను కోల్పోయా.. ప్రజా సేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చా.., సీఎం కేసీఆర్ ఆశీస్సులతో బీఆర్ఎస్ నుంచి ములుగు అసెంబ్లీ అభ్యర్థిగా బరిలో నిలిచాను. ఆడబిడ్డగా మీ ఇంటికి వస్తున్నా. గెలిపించి అసెంబ్లీ పంపించండి' అంటూ బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ అభ్యర్థి బడే నాగజ్యోతి అన్నారు. మండలంలోని మచ్చాపూర్‌లో ఆమె మంగళవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మచ్చాపూర్ నుంచి బుస్సాపూర్, చల్వాయి , గోవిందరావుపేట, రాంనగర్, ఎల్బీనగర్, దుంపిల్లగూడెం, అమృతండా, చంద్రుతండా, మొద్దులగూడెంతో పాటు పస్రాలో భారీ ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. 60 ఏండ్లలో కాంగ్రెస్ సాధించలేని అభివృద్ధిని పదేండ్లలో బీఆర్ఎస్ చేసి చూపిందన్నారు. అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కు పట్టంకట్టాలన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్‌లో అమలవుతున్నాయా అని ప్రశ్నించాలన్నారు. రాష్ట్రంలో మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, తనను ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే మొట్టమొదటి సారిగా నియోజకవర్గం నుంచి లక్నవరం సరస్సుకు దేవాదుల నీటిని మళ్లించేలా ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడి రైతుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మేడారం సమ్మక్క-సారలమ్మ తల్లుల ఆశీస్సులతో నాగజ్యోతి అసెంబ్లీకి వెళ్లడం ఖాయమని మండల ఎన్నికల ఇన్‌చార్జి సాంబారి సమ్మారావు అన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన బిడ్డగా మీ ముందుకు వచ్చి ఓట్లు అభ్యర్థిస్తున్న బడే నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుక ఇచ్చేలా కార్యకర్తలు ఈ 30రోజులు కష్టపడాలని పిలుపునిచ్చారు. అనంతరం పస్రా గ్రామంలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని బడే నాగజ్యోతి ప్రారంభించారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా గోవిందరావుపేట, పస్రాలో పలు పార్టీల నుంచి చేరిన 100మందికి నాగజ్యోతితో పాటు మండల ఎన్నికల ఇన్‌చార్జి సమ్మారావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ తుమ్మల హరిబాబు, మండల అధ్యక్షుడు సూరపనేని సాయికుమార్, సీనియర్ నాయకులు పిన్నింటి మధుసూధన్‌రెడ్డి, బూర సురేందర్, దేవానాయక్, హేమాద్రి, శ్రీనివాస్‌రావు, ఎంపీటీసీలు శ్రీనివాస్, రాంచందర్, సర్పంచులు ఈసం సమ్మయ్య, మోహన్‌రాథోడ్, గ్రామ కమిటీ అధ్యక్షులు పూర్ణచందర్, అకినేపల్లి రమేశ్, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.



చల్వాయి ప్రచారంలో మాట్లాడుతున్న సాంబారి సమ్మారావు, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి